ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
సోమవారం 5 ఫిబ్రవరి 2024



గ్యాస్ సిలిండర్ లారీ బోల్తా : తప్పిన పెను ప్రమాదం

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 4: వంటగ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్తున్న లారీ స్థానిక దొమ్మసంద్ర సర్కిల్లో డివైడర్‌ను ఢీకొని అదుపు తప్పి బోల్తా పడింది. శనివారం రాత్రి చోటు చేసుకున్న ఘటనలో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగినా పెను ప్రమాదం తప్పింది. ట్రాఫిక్ పోలీసులు సకాలంలో స్పందించి తగిన చర్యలు తీసుకున్నారు. కాగా అమృత్‌పార్క్ ల్యాండ్, దొమ్మసంద్ర సర్కిల్ ప్రాంతాలు రోడ్లు చిన్నవిగా ఉండి ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటున్న తరుణంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇందుకు సంబంధించి పలు మార్లు ఫిర్యాదులు చేసినా సరైన చర్యలు లేవనే విమర్శలు ఉన్నాయి.

అంబరాన్నంటిన... హంపి వైభవం

- కన్నుల పండువగా ముగిసిన ఉత్సవాలు
- తరలివచ్చిన దేశవిదేశీ పర్యాటకులు


ప్రత్యేక నృత్యాలు చేస్తున్న కళాకారులు

బళ్లారి, ఫిబ్రవరి 04 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యాటక కేంద్రమైన హంపిలో మూడు రోజుల పాటు అంబరాన్నంటిన హంపి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ నెల 2న ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేతుల మీదుగా హంపి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సుమారు రూ. 14 కోట్ల వ్యయంతో ఉత్సవాల నిర్వహించారు. గాయత్రి పీఠం, ఎదురు బసవన్న వేదిక తదితర మొత్తం నాలుగు వేదికలు ఏర్పాటు చేశారు. హంపిలో రాతిశిల్పాలు విద్యుత్ కాంతులతో వెలిగిపోయాయి. కుస్తీ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, గ్రామీణ క్రీడా పోటీలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వివిధ వేదికల మీద గానకచేరి, జానపద గీతాలు, జానపద నృత్యాలు అలరించాయి. తొలి రోజు ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు వేదికపై ప్రసంగించారు. మునుపెన్నడూ లేనివిధంగా ఈ యేడాది హంపి ఉత్సవాలు నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో హంపి మార్మోగింది.


వివిధ వేషధారణలో కళాకారులు


గాయత్రీ వేదిక ముందు భారీగా పాల్గొన్న జనం


అలరించిన భరత నాట్యం

రుణాల కోసం... వెంపర్లాట!

- వేధిస్తున్న నిధుల కొరత
- వెంటాడుతున్న కరువు సమస్యలు
- గ్యారెంటీలతో మోయలేని భారం
- కేంద్రం నుంచి సాయం శూన్యం
- కొత్త రుణాల కోసం కసరత్తు



బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ఢోకా లేదని, గ్యారెంటీలే కాకుండా అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య నిత్యం బహిరంగసభల్లో భరోసాలు కల్పిస్తున్నా ఆచరణలో అసాధ్యమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్యారెంటీల భారం, పన్ను వసూళ్లలో లోటు వెంటాడుతుండడంతో రుణాలవైపు సర్కారు ఎదురుచూస్తోంది. రాష్ట్రంలో తీవ్రమైన కరువు వెంటాడుతోంది. అన్నదాతలను ఆదుకోవాలన్నా, పశుగ్రాసం సమకూర్చాలన్నా, పల్లె ప్రాంతాలలో కనీసమైన దాహార్తి తీర్చాలన్నా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంది. కరువు పరిస్థితిపై కేంద్ర అధ్యయన బృందాలు రాష్ట్రంలో పర్యటించి నెలలు గడుస్తున్నా కేంద్రప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రత్యేక గ్రాంట్లు విడుదల కాలేదు. పైగా మరో రెండు నెలల్లోనే లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. రాష్ట్రంలో శాసన సభ ఎన్నికలు జరిగి 9 నెలలు ముగుస్తోంది. ఎమ్మెల్యేలు గ్రాంట్లు లేవని సొంత నియోజకవర్గాల్లో పర్యటించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. కరువు నెలకొన్న ప్రాంతాలకు ఒట్టి చేతులతో వెళ్తే ప్రజల నుంచి చీవాట్లు తినాల్సి వస్తుందని భయపడుతున్నారు. 35 మందికి మంత్రి పదవులు, మరో 35 ఎమ్మెల్యేలకు బోర్డులు కార్పొరేషన్ పదవులు దక్కాయి. హోదాలు వరించాయి కానీ అభివృద్ధి పనులకు ప్రజల నుంచి వస్తున్న వినతులను ఏ విధంగా పరిష్కరించాలో తెలియడం లేదనే పరిస్థితి నెలకొంది. 2023-24 ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో 50 రోజులు మాత్రమే గడువు ఉంది. చివరి త్రైమాసికంలో ఆశించినంత పన్నులు, ఇతరత్రా గ్రాంట్లు వచ్చే అవకాశం కనిపించడం లేదు. మరో పదిరోజుల్లోనే సీఎం సిద్దరామయ్య ఆర్థిక మంత్రి హోదాలో 2024-25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఏడాది బడ్జెట్‌లో అమలు చేసిన పథకాలు, అభివృద్ధి, గ్యారెంటీలతోపాటు గ్రాం ట్ల వివరాలు పొందుపరచాల్సి ఉంటుంది. గత ఏడాది కంటే బడ్జెట్ గాత్రం పెరుగుతుందనే అభిప్రాయాలు ఉన్నాయి. అయితే గ్రాంట్లలో కోత పడితే ఏ విధంగా సర్దుబాటు చేస్తారనేది కీలకమవుతోంది.

వేల కోట్ల రుణానికి కసరత్తు

2023-24 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం నుంచి వేల కోట్ల రూపాయలు తీసుకునేందుకు సిద్ధమైంది. ఓపెన్ కేటగిరీలో రూ.78,363 కోట్లు, ఎల్ఐసీ, ఎన్ఎస్ఎస్ఎఫ్, ఎన్‌సీడీ నుంచి రూ.1201 కోట్లు, ఇతరత్రా మొత్తం రూ.85,818 కోట్లు రుణం తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఐదు గ్యారెంటీలు, కరువు నిర్వహణతోపాటు పన్నుల సేకరణలో లక్ష్యాలు సాధ్యం కాకపోవడంతో ప్రభుత్వం రుణాలవైపు ఎదురుచూస్తోంది. ఓపెన్ కేటగిరీలో రుణాన్ని పొందడానికి ప్రయత్నిస్తోంది. ఆర్‌బీఐ ద్వారా రాష్ట్ర అభివృద్ధికి రుణం తీసుకునే ప్రయత్నం ముమ్మరం చేసింది. అక్టోబరు 15 నుంచే ప్రక్రియ సాగుతోంది. గడిచిన రెండు త్రైమాసికాలలో రాష్ట్రప్రభుత్వం అప్పులు పెంచుకునేందుకు ప్రయత్నించలేదు. మూడో త్రైమాసికంలో ప్రయత్నాలు చేసింది. డిసెంబరు, జనవరిలో రుణాలు పొందింది.

ఆర్‌బీఐ ద్వారా రూ.47వేల కోట్లు

2023 అక్టోబరు 17 నుంచి 2024 జనవరి వరకు ఆర్‌బీఐ ద్వారా ఓపెన్ కేటగిరీలో రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 47వేల కోట్ల రుణం తీసుకుంది. అక్టోబరు 17న రూ.1000 కోట్లు, 23న రూ.2వేల కోట్లు, 31న రూ. 2వేల కోట్లు, నవంబరు 1న రూ. 3వేల కోట్లు, 21న రూ.1000 కోట్లు, డిసెంబరు 5న రూ.4వేల కోట్లు, 12న రూ. 4వేల కోట్లు, 19న రూ. 4వేల కోట్లు, 26న రూ.3వేల కోట్లు, 2024 జనవరి 2న రూ. 6వేల కోట్లు, 9న రూ.7వేల కోట్లు, 16న రూ.5వేల కోట్లు, 23న రూ. 5వేల కోట్లు రుణం తీసుకున్నారు. చివరి త్రైమాసికంలో రూ. 58వేల కోట్ల రుణం తీసుకోదలిచారు. జనవరి నుంచి మార్చి వరకు ఆర్‌బీఐ ద్వారా ఈ రుణం పొందాలని నిర్ణయించారు.

కేంద్ర ప్రభుత్వ పక్షపాతంపై 7న ఢిల్లీలో ధర్నా

కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన గ్రాంట్లను విడుదల చేయడంలో జాప్యం చేస్తోందని, కరువు పరిస్థితిపై అధ్యయన బృందాలు పర్యటించి నెలలు గడుస్తున్నా సాయం చేయకుండా పక్షపాత ధోరణి చూపుతోందని కాంగ్రెస్ ప్రభుత్వం తరపున ఢిల్లీలో ఈనెల 7న నిరసనకు సిద్ధమయ్యారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సారథ్యంలో ఢిల్లీ లో కేంద్రప్రభుత్వ పక్షపాతధోరణిపై ఆందోళన చేయనున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులతోపాటు పార్టీ సీనియర్లు ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఎమ్మెల్యేలు మంత్రులు విమానాల్లో వెళ్లేందుకు టికెట్లు సిద్ధం చేసుకోగా మరింత మంది రైళ్లలో వెళ్లేందుకు రిజర్వు చేసుకుంటున్నారు. వేలాదిమంది ఢిల్లీ నిరసనలో పాల్గొనే అవకాశం ఉంది. మూడు రోజులుగా సీఎం, డీసీఎం కేంద్రప్రభుత్వం గ్రాంట్ల విడుదలలో అన్యాయం చేసిందని, బడ్జెట్‌లో కర్ణాటకకు మొండిచేయి చూపిందని దీనిపై తమ ఆవేదన దేశ రాజధాని ఢిల్లీలో నిరసన ద్వారా బహిరంగం చేయదలిచామని ప్రకటించారు.


ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఎంపీ డీకే సురేశ్ ఇంటి ముట్టడికి యత్నం

- బీజేపీ కార్యకర్తల అరెస్టు

బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక దేశం డిమాండ్ చేసిన కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ ఇంటిని ముట్టడించేందుకు బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు ఆదివారం ప్రయత్నించారు. సదాశివనగర్‌లోని డీకే సురేశ్ ఇంటిని ముట్టడించేందుకు పెద్ద ఎత్తున కార్యకర్తలు ప్యాలెస్ మైదానానికి చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా ఆయన నివాసం వైపు నినాదాలు చేస్తూ బయల్దేరారు. విషయం ముందుగానే తెలిసిన మేరకు ఎంపీ డీకే సురేశ్ నివాసంతోపాటు ఎదురుగా ఉన్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ నివాసం వద్దకు కాంగ్రెస్ కార్యకర్తలు చేరారు. బీజేవైఎం కార్యకర్తలు సదాశివనగర్‌వైపు దూసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఇదే సందర్భంలో డీకే సురేశ్ నివాసం వద్ద ఉండే కాంగ్రెస్ కార్యకర్తలు తోపులాటకు వచ్చారు. పోలీసులు ఇరువర్గాలను కట్టడి చేశారు. బీజేవైఎం ముఖ్యులు అనిల్‌శెట్టి, ప్రశాంత్, సందీప్ రవి, ప్రతాప్‌తోపాటు 35 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని బస్సులో ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేయగా ప్యాలెస్ రోడ్డులో బస్సులను కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈనెల 1న కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, ఇలాగైతే దక్షిణాదిలో ప్రత్యేక దేశం డిమాండ్ వస్తుందంటూ డీకే సురేశ్ వ్యాఖ్యానించారు. ఈ అంశం దేశవ్యాప్తంగా సంచలనానికి కారణమైంది.

ట్రాక్టర్ బోల్తా నలుగురు కూలీల దుర్మరణం

బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బెళగావి జిల్లా కాగవాడ తాలూకా శేడబాల గ్రామంలో చెరకు రవాణా చేస్తున్న ట్రాక్టర్ బోల్తా పడి నలుగురు మహిళా కూలీలు దుర్మరణం చెందారు. ఆదివారం మధ్యాహ్నం ప్రమాదం చోటు చేసుకుంది. మృతి చెందిన కూలీలలో మాలాబాయి రవసాబ్ ఐనాపురె (61), చంపా లక్కప్ప తలకట్టి (50), భారతి వడ్రాలె (40), షేకో నరసాయి (45) ఉన్నారు. చెరకు తోటలో పనులు ముగించుకుని ట్రాక్టర్‌లో వస్తుండగా శేడబాల గ్రామ సమీపాన జమఖండి మీరజ్ రోడ్డుపై చక్రం ఊడి బోల్తా పడడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో మహిళను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే కాగవాడ ఎమ్మెల్యే రాజు కాగె సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగవాడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రాన్ని చుట్టేస్తున్న విజయేంద్ర

- 70 రోజుల్లో 10వేల కిలోమీటర్లు తిరిగిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు



బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర రాష్ట్రమంతటా సుడిగాలిలా తిరుగుతున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన 70 రోజుల వ్యవధిలోనే 10వేల కిలోమీటర్ల మేర పర్యటించారు. గతంలో రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించినవారితో పోలిస్తే ఇంత తక్కువ వ్యవధిలో ఇలా పర్యటించిన దాఖలాలు లేవు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పాటు దక్షిణకన్నడ జిల్లా ఎంపీ నళిన్‌కుమార్ కటీల్ వ్యవహరించారు. శాసనసభ ఎన్నికల్లో ఓటమితో ఆయన పదవి నుంచి తప్పుకునేందుకు సిద్ధమయ్యారు. కొంతకాలం వేచి ఉండాలని సూచించిన అధిష్ఠానం విజయేంద్రకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. విజయేంద్ర బాధ్యతలు స్వీకరించిన వెంటనే పార్టీకి సంబంధించిన అన్ని కమిటీల ప్రక్షాళనతోపాటు లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తుండడంతో రాష్ట్రమంతటా నిరంతరం పర్యటించే ప్రక్రియ కొనసాగించారు. తండ్రి, సీనియర్ నేత యడియూరప్ప సలహాలకు అనుగుణంగా రాష్ట్ర పర్యటన సాగిస్తున్నారు.

క్యాన్సర్‌పై జాగృతికి వాకథాన్


బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ కాన్సర్ డేను పురస్కరించుకుని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, సర్జికల్ సొసైటీ ఆఫ్ బెంగళూరు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక వాకథాన్ నిర్వహించారు. కంఠీరవ స్టేడియం నుంచి 5 కిలో మీటర్ల పాటు వాకథాన్‌కు ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు పచ్చజెండా చూపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆహార పద్ధతులు, ఒత్తిడితో కూడిన జీవనం, బొజ్జ, కాలుష్యం తదితర సమస్యల కారణంగా క్యాన్సర్‌కు దారి తీసే అవకాశం ఉందన్నారు. క్యాన్సర్ రోగాన్ని ఆరంభంలో గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చునన్నారు. మెరుగైన ఆరోగ్యం కోసం ప్రతి రోజూ కొద్దిసేపు యోగా, నడకకు సమయం కేటాయించాలన్నారు. క్యాన్సర్ రహిత సమాజం కోసం ఆరోగ్యశాఖ నిరంతరం శ్రమిస్తోందన్నారు. సర్జికల్ సొసైటీ ఆఫ్ బెంగళూరు అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఆరంభంలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే చికిత్స సులభతరం కానుందన్నారు. ప్రత్యేకించి ఇటీవలి కాలంలో మహిళల స్థనక్యాన్సర్ బారిన పడుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్యాన్సర్‌పై జాగృతి కల్పిస్తూ కన్నడ, తమిళ, తెలుగు సహా 9 భాషల్లో పుస్తకాలు రూపొందించామన్నారు. ఒకవేళ క్యాన్స ర్ లక్షణాలు గుర్తిస్తే ఆందోళన చెందకుండా తగిన జాగ్రత్తలు పాటించి చికిత్సలు పొందాలన్నారు.


కంఠీరవ స్టేడియంలో సందడి ఇలా....


విధానసౌధ వద్ద వాకథాన్‌లో మంత్రి దినేశ్ గుండూరావు తదితరులు

క్యాన్సర్‌పట్ల అవగాహనే ముఖ్యం
- రాజీవ్‌గాంధీ వీవీ ఉపకులపతి ఎంకే రమేశ్

క్యాన్సర్ పట్ల అవగాహన ముఖ్యమని రాజీవ్‌గాంధీ వైద్య విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఎంకే రమేశ్ తెలిపారు. వరల్డ్ క్యాన్సర్ డేను పురస్కరించుకుని ముగ్గురు క్యాన్సర్ నిపుణులు రచించిన క్యాన్సర్ ప్రివెన్షన్ ఏ గైడ్ అనే పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంకే రమేశ్ మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇటువంటి పుస్తకాలు దోహదపడతాయని పేర్కొన్నారు. సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్యాన్సర్ ఫౌండర్ డైరెక్టర్, చైర్మన్, సహసంపాదకులు డాక్టర్ నందా రజనీశ్ మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులు పాటిస్తేనే క్యాన్సర్‌పై పోరాటం చేయవచ్చునన్నారు. యనపోయా యూనివర్సిటీ వీసీ, సహ సంపాదకుడు డాక్టర్ ఎం విజయ్‌కుమార్, మరో సహసంపాదకుడు డాక్టర్ రోహన్ థామస్ మాథ్యూ పాల్గొన్నారు. వైద్యనిపుణులతోపాటు నగరంలోని ప్రముఖ క్యాన్సర్ నిపుణులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.21	1,615.19
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	266	8,990
సామర్థ్యం (టీఎంసీలు)	9.60	48.87

యువతకు చరిత్రను తెలియజేయాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దివాకర్

హొసపేట, ఫిబ్రవరి 4: యువతరానికి పరిశోధనల ద్వారా చరిత్ర, వారసత్వాన్ని తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని విజయనగరం జిల్లాకలెక్టర్ ఎంఎస్. దివాకర్ అన్నారు. కమలాపురం-హంపి కమల్‌మహల్ సమీపంలోని పురావస్తు శాఖ కార్యాలయ ఆవరణలో పురావస్తుశాఖ, మ్యూజియంలు, జిల్లా వారసత్వ సంపద విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విజయనగర అధ్యయనాలపై నిర్వహించిన 28వ వార్షిక సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. హంపి ఉత్సవ్ 2024 విజయనగరం తన గత వైభవాన్ని తిరిగి పొందేలా చేసిందన్నారు. భవిష్యత్తు తరాలకు మన చరిత్ర, వారసత్వాన్ని తెలియజేసెందుకు పరిశోధనలు పెరగాలన్నారు. ఈనేపథ్యంలో విజయనగరం అధ్యయనంపై వార్షిక సదస్సు కార్యక్రమం ఉపకరిస్తుందన్నారు.

కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే గవియప్ప మాట్లాడుతూ చరిత్రను తెలుసుకుని భావి తరాన్ని కాపాడే బాధ్యతను భుజాన వేసుకోవాలన్నారు. ధార్వాడ్ లోని కర్ణాటక విశ్వవిద్యాలయం ప్రాచీన భారత చరిత్ర ,శాసనాల విభాగం ఇన్‌చార్జి డాక్టర్ శ్రీనివాస్ ఈసదస్సుకు అధ్యక్షత వహించారు. సదస్సులో పర్యాటక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రభులింగ తలకేరి, కమలాపురం, హంపి ఆర్కియాలజీ, మ్యూజియంలు వారసత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శేజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు లోక్‌సభ స్థానాలలో కేఆర్‌పీ పోటీ



సమావేశంలో మాట్లాడుతున్న కేఆర్పీ పార్టీ నేతలు

సిరుగుప్ప, ఫిబ్రవరి 04 :రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కేఆర్‌పీ ఐదు లోక్‌సభ స్థానాలలో పోటీ చేస్తున్నటు ఆ పార్టీ రాష్ట్ర యూత్ అధ్యక్షులు భీమాశంకర్ పాటిల్ తెలిపారు. సిరుగుప్ప పట్టణంలో ఆదివారం కేఆర్‌పీ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమాశంకర్ పాటిల్ మాట్లాడుతూ కేఆర్‌పీ రాష్ట్ర అధ్యక్షులు గాలి జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు లోక్ సభ స్థానాలలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. యూత్ కర్యకర్తలు, పార్టీ సిద్దాంతాలను తెలిపి అభ్యర్థుల కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేఆర్‌పీ రాష్ట్ర ఎస్టీ మోర్చ అధ్యక్షులు దరప్ప నాయక మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్యే బీఎం నాగరాజు, మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప తాలుకా అభివృద్ధికి కృషి చేయడంలో మొగ్గు చూపలేదన్నారు. రహదారుల సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ: వ్యక్తి మృతి

కుందుర్పి, ఫిబ్రవరి 4: అనంతపురం జిల్లా కుందుర్పి మండల పరిధిలోని అల్లాపురం గ్రామ సమీపాన ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు గాయపడగా, అందులో ఒకరు చికిత్సపొందుతూ మరణించారు. శెట్టూరు మండలం కనుకూరు గ్రామానికి చెందిన సురేష్ తన భార్య, చిన్న కుమారుడితో కలసి కుందుర్పి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో చదువుతున్న తన పెద్దకుమారుడిని చూసేందుకు వస్తుండగా, కర్ణాటక వాసి అయిన యశ్‌పాల్ శర్మ బసాపురంకు పనినిమిత్తం వెళుతూ ఎదురుగా వచ్చాడు. రెండు ద్విచక్ర వాహనాలు అల్లాపురం మలుపు వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో యశ్‌పాల్ శర్మకు తీవ్ర రక్తగాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సురేష్‌కు, అతడి కుమారుడికి స్వల్ప గాయాలు కావడంతో 108లో వారిని కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. యశ్‌పాల్ శర్మను పరశురాంపురం ప్రభుత్వాస్పత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం చిత్రదుర్గానికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు.

అంగళ్ల రతనాలు అమ్మినారట ఇచట!

● వైభవంగా జానపద వాహిని ఊరేగింపు
● ముగిసిన హంపీ ఉత్సవాలు

రద్దీతో కళకళలాడిన దుకాణాలు



దుకాణాల వద్ద కొనుగోళ్ల కోసం పర్యాటకుల బారులు




హీరో దర్శన్ జ్యోతి ప్రజ్వలన





వేదిక ముందు దర్శనమిచ్చిన ఖాళీకుర్చీలు





కరడిధామ వన్యజీవి ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. అందులో పులి, చిరుత, ఎలుగుబంట్లు, జింకలను చూసి పిల్లలు కేరింతలు కొట్టారు.

హంపి ఉత్సవాల చివరి రోజు ఆదివారం ఎదురుబసవన్న, విరుపాక్షేశ్వర వేదిక, కడ్లే కాళు గణపతి వేదికల వద్ద కంటే దుకాణాల వద్దనే రద్దీ అధికంగా కనిపించింది. తల్లిదండ్రులతో కలిసి వచ్చిన పిల్లలు దుకాణాల వద్ద బారులుతీరారు. కుటుంబ సభ్యులకు ఇష్టమైన వాటిని కొనుగోలు చేశారు. వేదికలపై భరత నాట్యం, వివిధ కళాకారులు నృత్యాలు చేపడుతున్నా అక్కడ మాత్రం కుర్చీలు ఖాళీగా కనిపించాయి.



ఎదురు బసవన్న వేదిక వద్ద నాట్య ప్రదర్శన



పోటీలో గెలుపొందిన జాగిలాల యజమానులకు సర్టిఫికెట్లు ఇస్తున్న నిర్వాహకులు

ముగింపు సందర్భంగా దద్దరిల్లిన గాయత్రీ వేదిక

కంప్లి, ఫిబ్రవరి 04 :హంపీ ఉత్సవాల్లో మూడవ రోజు సందర్భంగా గాయత్రీ వేదిక దద్దరిల్లింది. చివరి రోజు కావడంతో వేదికపై చిత్రనటులు రవి చంద్ర, ప్రేమ్‌తో పాటు వారి జట్టు పూర్తిగా ఆకట్టుకుంది. వివిధ సినిమా పాటలను వీక్షించేందుకు వచ్చిన ప్రేక్షకులు తమ సెల్‌ఫోన్లతో టార్చ్ లైట్లు వేస్తూ పూర్తిగా ఆకట్టుకున్నారు. అలాగే రవిచంద్ర, సాధుకోకిలలు మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయలు పరిపాలించిన ఈ సామ్రాజ్యం ఎన్ని తరాలు వెళ్లినా ఈ ఉత్సవాలు గుర్తుండిపోతాయన్నారు. మున్ముందు రాబోయే యువతరానికి ఈ ఉత్సవాలు మరింత గుర్తింపునిస్తాయన్నారు. దసరా ఉత్సవాల మాదిరిగా ఈ హంపీ ఉత్సవాలు కూడా ఉత్తర కర్ణాటకలో భాగంగా ప్రతి ఒక్కరికి గుర్తుండిపోతాయన్నారు. అలాగే వివిధ కూచిపూడి నృత్యాలు, సంకీర్తనలు భరత నాట్యంతో కళాకారులు పూర్తిగా ఆకట్టుకున్నారు. ఆదివారం సెలవు కావడంతో సినిమా హీరోలు, గాయకులు రావడంతో ఎదురు బసవన్న వేదిక, ఈశ్వర వేదిక కడ్లే గణపతి వేదిక కన్నా గాయత్రీ పీఠం వేదిక వద్దకు భారీఎత్తున ప్రేక్షకులు హాజరయ్యారు. ఇదే వేదికపై శనివారం రాత్రి హీరో దర్శన్ హాజరు కావడమే కాకుండా తమదైన శైలిలో వీక్షించేందుకు వచ్చిన వారికి వివిధ అంశాలతో చర్చించారు. తాము కూడా మదకరి నాయక, సంగుళ్లి రాయణ్ణ, శ్రీకృష్ణదేవరాయ చిత్రాలలో నటించామన్నారు. ఈ శ్రీకృష్ణదేవరాయల పరిపాలనే ఆ చిత్రాలలో గుర్తుకువస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జమీర్ అహ్మద్, గవియప్ప, జేఎన్ గణేష్, రాఘవేంద్ర ఇత్నాల్, బీమా నాయక్, జిల్లా అధికారులు ఎంఎస్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

7న బెంగళూరులో ఉద్యోగుల నిరసన

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 4: బెంగళూరు ఫ్రీడం పార్క్ వద్ద ఈ నెల 7న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఒక రోజు రాష్ట్రస్థాయి నిరసన దీక్ష నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా గవర్నమెంట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లాయూనిట్ అధ్యక్షుడు అలం భాషా, గౌరవాధ్యక్షుడు సుదీప్ కమార్ తెలిపారు. నగరంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల వివిధ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ బెంగళూరులో ఈ నిరసన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా గౌరవ సలహాదారు రిజ్వాన్, నసీర్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి శరణప్ప కరటగి, ఉపాధ్యాక్షుడు బసవరాజు గడద్, మహ్మద్ ముక్తియార్, కో-ఆర్డినేటర్ డి.సుల్తాన్ తదితరులు మాట్లాడుతూ 40శాతం పెంపుతో 7వ వేతన సవరణను తక్షణమే అమలు చేయాలన్నారు. రాష్ట్ర ఉద్యోగులందరికీ పీఎఫ్‌ఆర్‌డీఏ చట్టం/ఎన్‌పీఎస్ వ్యవస్థను రద్దు చేయడం, సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం లాంటి డిమాండ్లను ఆమోదించాలన్నారు. ప్రభుత్వం నుంచి జీతం నేరుగా ఉద్యోగి ఖాతాలో జమకావాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అలం భాషా, తదితరులు

చివరిరోజు ఆకట్టుకున్న జాగిలాల ప్రదర్శన

హొసపేట, కంప్లి, ఫిబ్రవరి 4: హంపీ ఉత్సవంలో కుక్కల ప్రదర్శన ప్రజలను ఆకర్షించింది. ఈ ఉత్సవంలో పోలీస్ కుక్కలు కూడా ప్రదర్శనలో పాల్గొనడం ఇదే తొలిసారి. ఇందులో పాల్గొన్న ఒకటిన్నర ఏళ్ల బ్రౌన్ డాబర్‌మాన్ డాగ్ దాదాపు 19 క్రిమినల్ కేసుల్లో, నేరస్థులను గుర్తించడంలో ముఖ్య పాత్ర పోషించింది. రెండేళ్ల లూసీ, లాబ్రడార్ బాంబులను గుర్తించ డంలో నిపుణురాలు. అదే రకానికి చెందిన సింబాకు ఏడాదిన్నర వయస్సు ఇది క్రిమినల్ కేసుల దర్యాప్తులో పోలీసులకు సహాయం చేస్తుంది. ఈకుక్కలు నిలబడడం, కూర్చోవడం, దొర్లడం, సిగ్నల్‌కు ఆధారంగా మొరగడం శిక్షకుని ఆదేశాన్ని అనుసరించి గౌరవించడం చూసి ప్రజలు ఆశ్చర్యపోయారు. ఈ ఉత్సవంలో 19రకాల దేశీ, విదేశీ జాతులకు చెందిన 66కు పైగా కుక్కలు వాటి యజమానులతో కలిసి పాల్గొన్నాయి. హంపి ఉత్సవ్ 2024 డాగ్ షోలో హొసపేట నగరానికి చెందిన వీరూ చాంపియన్‌గా నిలిచింది. ఆ కుక్కకు మొదటి బహుమతిగా రూ.10వేల రూపాయలు అందజేశారు. రెండవ బహుమతిగా మరియమ్మనహళ్లికి చెందిన సతీశ్‌చిద్రీకి చెందిన కుక్కకు రూ.7500 నగదు, మూడో బహుమతిగా మరియమ్మనహళ్లికి చెందిన బసవరాజు కుక్కకు రూ. 5000 నగదును అందజేశారు. ఈసందర్భంగా పశుసంవర్ధక పశువైద్య సేవల శాఖ డిప్యూటీ డైరెక్టర్ పాంసింగ్,అసి స్టెంట్ డైరెక్టర్ బెన్ని బసవరాజు, వెటర్నరీ అధికారులు డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ యుగేంద్ర మాన్వి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జానపద వాహిని ఊరేగింపు

ప్రసిద్ది గాంచిన హంపిలో ముగింపు దినోత్సవం సందర్భంగా జానపద వాహిని ఊరేగింపు వైభవంగా జరిగింది. ఉద్భవ వీరభద్ర దేవస్థానం నుంచి ఈ ఊరేగింపు ప్రారంభమైంది. ఈ కార్యక్రమంను ఎమ్మెల్యే గవియప్ప భువనేశ్వరి దేవికి పూజలు నిర్వహించి ప్రారంభించారు. భువనేశ్వరి దేవికు, లక్ష్మీదేవికు ఏనుగుపైన ఊరేగింపు నిర్వహించారు. నృత్యాలు, భరత నాట్యాలు, వివిధ వేషధారణలు, ఆకట్టుకున్నాయి.

హోసూరు జోన్

ఘనంగా త్యాగరాజ ఆరాధన మహోత్సవం



త్యాగరాజ ఆరాధన మహోత్సవంలో పంచరత్న కీర్తనలను ఆలపిస్తున్న దృశ్యం

హోసూరు, ఫిబ్రవరి 4: హోసూరులో 177వ త్యాగరాజ ఆరాధన మహోత్సవంలో భాగంగా సంగీత కళాకారులు నివాళి అర్పించారు. కర్ణాటక సంగీత త్రయంలో ఒకరైన త్యాగరాజ స్వామి 177 వ ఆరాధన ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కర్ణాటక సంగీతం నేర్చుకుంటున్న యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంగీతాలాపనతో నివాళులర్పించారు. హోసూరు బ్రాహ్మణ ట్రస్ట్ తరపున శ్రీ గాయత్రి కళ్యాణమంటపంలో జరిగిన కార్యక్రమంలో తెల్లవారుజాము నుంచి త్యాగరాజ స్వామివారి విగ్రహాన్ని అలంకరించి ఎదురుగా కూర్చొని పెద్ద సంఖ్యలో సంగీత విద్వాంసులు కీర్తనలు ఆలపించారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రా రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో సంగీత విద్వాంసులు పాల్గొని త్యాగరాజ స్వామి పంచరత్న కీర్తనలను ఆలపించారు. అనంతరం మహా మంగళహారతి సేవ నిర్వహించారు.

పీఎంకేలోకి పలువురి చేరిక

హోసూరు (మత్తిగిరి), ఫిబ్రవరి 4: హోసూరులో పాటాళి మక్కళ్ పార్టీలోకి పలువురు చేరారు. పశ్చిమ జిల్లా పార్టీ కార్యదర్శి గోవిందరాజ్, జిల్లా మాజీ అధ్యక్షుడు మునిరాజ్ సమక్షంలో రాష్ట్ర మైనార్టీ డివిజన్ ఉప కార్యదర్శి ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో 100 మందికిపైగా ఇతర పార్టీలనుంచి వచ్చినవారు పాటాలి మక్కల్ పార్టీలో చేరారు. 2026 ఎన్నికల్లో అన్బుమణి రామదాస్‌ను ముఖ్యమంత్రి కుర్చీలో కుర్చోబెట్టేందుకు చర్యలు చేపడతామని ప్రతిజ్ఞ చేశారు. వన్నియర్ సంఘం జిల్లా అధ్యక్షుడు అరుళ్, పాటాళి యూనియన్ జిల్లా కార్యదర్శి గజేంద్రన్, రాజా, పాటాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఉప కార్యదర్శి శరవణన్, జిల్లా ఉపకార్యద ర్శి మహేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణన్, నగర కార్యదర్శులు షణ్ముగం, గుణశేఖర్, మయిల్‌స్వామి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్‌భాయ్, మైనార్టీ విభాగం జిల్లా ఉప కార్యదర్శి ఖాదర్‌బాషా, నాగరాజ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా 28వ వార్డు నగర కార్యదర్శి మునియప్పన్ ధన్యవాదాలు తెలిపారు.

సైకిల్ జాతాకు నగరంలో ఘన స్వాగతం

రాయచూరు, ఫిబ్రవరి 4 : వాల్మీకి సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రిటైర్డ్ ఉద్యోగి చేపట్టిన సైకిల్ జాతాకు ఆదివారం నగరంలో ఘన స్వాగతం లభించింది. సింధనూరు ఎక్సైజ్ శాఖ కార్యలయంలో డ్రైవర్‌గా పని చేసి ఏడాది క్రితం రిటైర్డ్ అయిన ఉద్యోగి ఇటీవలే సింధనూరు నుంచి సైకిల్ జాతా ప్రారంభించారు. సింధనూరు నుంచి జాతా రాయచూరు నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద చేరుకున్న నేపథ్యంలో కులబాంధవులు పెద్ద ఎత్తున ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. కాగా సమాజంలోని అందరూ ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని ఆ సందేశం వినిపించడమే లక్ష్యంగా తాను జాతా చేపట్టినట్లు ఆయన తెలిపారు.



అంబేడ్కర్ సర్కిల్ వద్ద జాతాను స్వాగతిస్తున్న నాయకులు

నేటి ప్రముఖులు

పోర్ట్రయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్స్...

షేక్ నాజర్ (జయంతి)



బుర్రకథా పితామహుడిగా పేరొందిన 'పద్మశ్రీ' గ్రహీత షేక్ నాజర్ వలి 1920 ఫిబ్రవరి 5న గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో జన్మించారు. ప్రాచీన జానపద కళారూపమైన బుర్రకథకు జీవం పోసి మెరుగులు దిద్ది, ప్రత్యేక ఆహార్యంతో తగిన హావభావాలతో ప్రదర్శనలిచ్చి విస్తృత ప్రచారం చేశారు. నటుడు, ప్రజా రచయిత, గాయకుడు కూడా. కృష్ణలీలలో దేవకి, శ్రీకృష్ణ తులాభారంలో రుక్మిణి, భక్త రామదాసులో చాందిని వంటి స్త్రీ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించారు. కమ్యూనిస్టు పార్టీలో చేరి ప్రజానాట్య మండలి ద్వారా పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలను బుర్రకథల ద్వారా చేరువ చేశారు. విరసం సభ్యుడిగా కూడా కొనసాగారు. ఆంధ్ర నాటక అకాడమీచే 1981లో ఉత్తమ కళాకారుడిగా సత్కారం, ఇతర గౌరవాలు అందుకున్నారు. 1997 ఫిబ్రవరి 22న కన్నుమూశారు.

వట్టికోట ఆళ్వారుస్వామి (వర్ధంతి)



వట్టికోట ఆళ్వారుస్వామి 1915 నవంబరు 1న నల్లగొండ జిల్లా నకిరేకల్ సమీపంలోని చెరువు మాదారంలో జన్మించారు. తెలంగాణ ప్రజాసాహిత్యానికి పాదులు వేసి ప్రాణం పోశారు. రచయిత, సేవాశీలి, ఉద్యమకర్త, కమ్యూనిస్టు నేత, ప్రచురణకర్త, పాత్రికేయుడు, ప్రచారకుడు, భాషా సాహిత్యాల దగ్గర్నుంచి పౌర హక్కులదాకా వట్టికోట అన్ని ఉద్యమాల్లో పాలుపంచుకున్నారు. తెలుగులో రాజకీయ నవలలకు ఆద్యుడు. నిజాం గడగడలాడించిన ఆంధ్రమహాసభ నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించారు. 1961 ఫిబ్రవరి 5న కన్నుమూశారు.

డాక్టర్ ప్రతాపచంద్ర రెడ్డి (పుట్టినరోజు)



దేశంలోని తొలి కార్పొరేట్ చైన్ ఆసుపత్రిగా ఉన్న అపోలో ఆసుపత్రి సంస్థాపకుడు డాక్టర్ ప్రతాపచంద్రరెడ్డి 1933 ఫిబ్రవరి 5న చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం అరగొండలో జన్మించారు. అపోలో ఆసుపత్రిని స్థాపించిన తర్వాత అపోలో ఫార్మసీ సంస్థను కూడా స్థాపించారు. వైద్యరంగానికి ఆయన అందిస్తున్న సేవలకు పద్మభూషణ్, పద్మ విభూషణ్ పురస్కారాలు పొందారు. లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నుంచి మానవతా పురస్కారం పొందారు. 2022లో జీవితసాఫల్య పురస్కారం అందుకున్నారు. కాగా ఆయన నలుగురు కుమార్తెలు కూడా అపోలో హాస్పిటల్స్‌లో డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు.

అభిషేక్ బచ్చన్ (పుట్టినరోజు)



ప్రముఖ బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ 1976 ఫిబ్రవరి 5న ముంబైలో జన్మించారు. తల్లిదండ్రులైన అమితాబ్ బచ్చన్, జయబచ్చన్‌ల నుండి నటన వారసత్వంగా పుణికి పుచ్చుకున్నారు. నటుడిగా, నిర్మాతగా సత్తా చాటుకున్నారు. యువ, సర్కార్, కభీ అల్‌విదా నా కెహనా చిత్రాలు ఉత్తమ సహాయ నటుడి కేటగిరీలో ఫిలింఫేర్ పురస్కారాన్ని అందించాయి. 2009లో హిందీలో నటించిన 'పా' చిత్రానికి నేషనల్ ఫిలింఫేర్ పురస్కారం లభించింది. ప్రముఖ నటి ఐశ్వర్యారాయ్‌ను అభిషేక్ వివాహమాడారు.

క్రిస్టియానో రోనాల్డో (పుట్టినరోజు)



పోర్చుగీసుకు చెందిన ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు క్రిస్టియానో రోనాల్డో 1985 ఫిబ్రవరి 5న జన్మించారు. పోర్చుగల్ ఫుట్‌బాల్ నేషనల్ టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించారు. తన కెరీర్‌లో యూరోపియన్ గోల్డెన్ షూస్, యూఈఎఫ్ఏ నేషనల్ లీగ్ టైటిల్ సహా 31 ప్రముఖ ట్రోఫీ లను గెలుపొందాడు. ప్రపంచపు అత్యుత్తమ ఫుట్ బాల్ క్రీడాకారుల్లో ఒకడిగా గుర్తింపు పొందారు. 100 ఇంటర్నేషనల్ గోల్స్, 770 సీనియర్ కెరీర్ గోల్స్‌తో తనదైన రికార్డు సాధించారు.

జీవనశైలి మార్పుతో క్యాన్సర్‌పై విజయం

- మారథాన్ స్పెషలిస్ట్ జయరాజ్
- పలు చోట్ల జాగృతి కార్యక్రమాలు

బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ మహమ్మారి దేశవ్యాప్తంగా తీవ్ర ప్రభావం చూపుతోందని ఏటా వేలాదిమంది బలవుతున్నారని జయించాలంటే జీవన శైలిలో మార్పు ముఖ్యమని ఇంటర్నేషనల్ మారథాన్ స్పెషలిస్ట్ ఆరోక్యస్వామి జయరాజ్ అభిప్రాయపడ్డారు. ఆదివారం వైట్‌ఫీల్డ్ కన్నమంగలలోని అటల్‌బిహారి వాజ్‌పేయ్ ఉద్యానవనంలో ప్రత్యేక కార్యక్రమం జరిపారు. వాకింగ్ చేసేవారితోపాటు స్థానికులను ఉద్దేశించి జయరాజ్ మాట్లాడుతూ వాకథాన్, మారథాన్‌లలో పాల్గొనడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ప్రతి మనిషి జీవనశైలి మార్చుకోవాలన్నారు. పొగాకు ఉత్పత్తుల వాడకం



శిబిరంలో పరీక్షల నిర్వహణ

వీడాలన్నారు. ధూమపానంతోపాటు పాన్‌పరాగ్ వంటివి పెను ప్రమాదకరమన్నారు. ఆరోగ్యకర జీవనం ద్వారా కుటుంబం, సమాజం శక్తివంతం కానుందన్నారు. 200మందికి పైగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఎయిర్ వెటరన్ పీపీ పాండే పర్యవేక్షించారు.

క్యాన్సర్ ఉచిత పరీక్షా శిబిరం

చింతామణి, ఫిబ్రవరి 4: పట్టణంలోని బెంగళూరు రోడ్డుకు అనుబంధంగా ఉండే రాఘవేంద్ర స్వామి ఆలయ ఆవరణలో బెంగళూరు బసవనగుడి ప్రాంతానికి చెందిన శంకర కేన్సర్ ఫౌండేషన్, శంకర కేన్సర్ ఆసుపత్రి పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో వరల్డ్ కేన్సర్ డేను పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. శంకర్ కేన్సర్ ఆసుపత్రి చింతామణి శాఖ డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ రెండేళ్లుగా ఇటువంటి శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక వాహనాలు ఉన్నాయన్నారు. తాలూకా వ్యాప్తంగా కేన్సర్‌పై జాగృతి, పరీక్షా శిబిరాలు నిర్వహించి నోటి, స్థన, గర్భకోశ కేన్సర్ పరీక్షలు చేసి సుమారు 60-70మందికి చికిత్సలు అందించినట్టు తెలిపారు. రెండో విడత ఉచిత శిబిరంలో 18ఏళ్ల పైబడినవారికి అవకాశం కల్పించామన్నారు. పురుషులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిగరెట్, బీడీ, పాన్‌పరాగ్, గుట్కా, కిళ్లీ వేసుకోవడం, మద్యపానం వంటి వాటి వల్ల కేన్సర్ సోకే ప్రమాదం ఉందన్నారు. ఆరంభ దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చునన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దీపనావిత్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



కన్నమంగల పార్కులో క్యాన్సర్‌పై అవగాహన ఇలా...

హెచ్‌ఎస్‌ఆర్‌పీకి 12రోజులే గడువు

- 95శాతం ప్రభుత్వ వాహనాలకు పెండింగ్

బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వాహనాలకు సురక్షితమైన నెంబర్ ప్లేట్‌ను తప్పనిసరి చేసిన విధానం ఆదేశించినవారే పాటించేలా లేరనిపిస్తోంది. హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్‌ఎస్‌ఆర్‌పీ) ప్రతి వాహనానికి అమర్చుకోవాలనే విధానం ఏళ్ల తరబడి వాయిదాలు పడుతూ వస్తోంది. ఈనెల 17తో గడువు ముగియనుంది. ఇప్పటి వరకు 11 లక్షల వాహనాలకు హెచ్‌ఎస్‌ఆర్‌పి నెంబర్ ప్లేట్లను అమర్చుకున్నారు. మరో 1.89 కోట్ల వాహనాలకు సదరు ప్లేట్‌లను సమకూర్చాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన ఉత్తర్వులు అనుబంధమైన శాఖలు పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వానికి సంబంధించి అన్ని శాఖల వాహనాలను పరిశీలిస్తే కేవలం 5శాతం వాహనాలకు మాత్రమే హెచ్‌ఎస్‌ఆర్‌పీ ప్లేట్‌లను అమర్చారు. దీన్నిబట్టి కొత్త నెంబరు ప్లేట్‌లను అమలు చేయాల్సిన రవాణాశాఖ, పర్యవేక్షించాల్సిన పోలీసు శాఖల వాహనాలు కూడా చాలావరకు అమర్చలేదని తెలుస్తోంది. 2019 ఏప్రిల్‌కు ముందు రిజిస్ట్రేషన్ చేసుకున్న అన్ని వాహనాలకు హెచ్‌ఎస్‌ఆర్‌పీ ప్లేట్‌లను అమర్చుకోవాల్సి ఉంది. 2019 ఏప్రిల్ తర్వాత కొనుగోలు చేసిన వాహనాలకు షోరూంలలోనే నెంబరు ప్లేట్‌లు సమకూరుస్తున్నారు. వాహనం కొనుగోలు చేసిన సమయంలోనే హెచ్‌ఎస్‌ఆర్‌పీ ప్లేట్‌లకు సంబంధించిన అదనపు చార్జీలను వసూలు చేస్తున్నారు. దీంతో అనివార్యంగా అమర్చుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2019కు ముందు కొనుగోలు చేసిన వాహనాలు 2కోట్ల దాకా ఉన్నాయి. వీటిలో 70శాతం ద్విచక్రవాహనాలు, కాగా 20 శాతం కార్లు, ఆటోల వంటివి, 10శాతం రవాణా వాహనాలు ఉన్నాయి. 2023 నవంబరు 17వరకు అవకాశం ఉండేది. అయితే ఎక్కువమంది ప్రజలు సదరు నెంబరు ప్లేట్‌లను ఏర్పాటు చేసుకోలేదు. దీంతో గడువు పెంచారు. మూడు నెలల గడువు ఈనెల 17తో ముగియనుంది. హెచ్‌ఎస్‌ఆర్‌పీ ప్లేట్‌లకు సంబంధించి సమగ్రంగా ప్రచారం లేకపోవడం, పలుమార్లు వాయిదాలు వేస్తుండడంతో గందరగోళం నెలకొంది. అసలు హెచ్‌ఎస్‌ఆర్‌పీ ప్లేట్‌లు ఎందుకు తప్పనిసరి చేశారనే వాదనలు ఉన్నాయి. రవాణాశాఖ కూడా ఇందుకు సంబంధించి ప్రజలలో అవగాహన కల్పించేందుకు తగిన కార్యక్రమాలు కొనసాగించిన దాఖలాలు కూడా లేవు. హెచ్‌ఎస్‌ఆర్‌పీ ప్లేట్‌లు లేకుంటే వెయ్యి రూపాయల జరిమానా విధిస్తారు. ఆ తర్వాత ఎన్నిసార్లు పోలీసులకు పట్టుబడినా ప్రతిసారి వెయ్యి రూపాయలు జరిమానా తప్పనిసరిగా వసూలు చేస్తారు.

హెచ్‌ఎస్‌ఆర్‌పీ ఎందుకంటే...

హెచ్‌ఎస్‌ఆర్‌పీ నెంబర్‌ప్లేట్‌లు సాధారణ ప్లేట్‌ల తరహాలో ఉండదు. వీటిని మార్చడం, లేదా నెంబర్లపై స్టిక్కర్‌లు అతికించడం లేదా వాటికి మార్పులు చేర్పులు చేయడం వంటివి సాధ్యం కాదు. క్రోమియం ఆధారిత హోలోగ్రామ్‌తో రూపొందిస్తారు. వీటి కిందిభాగంలో 10నెంబర్ల ప్రత్యేక నెంబరు ఉంటుంది. సంఖ్యల ప్రకారం ఇంగ్లిష్‌లో ఇండియా అనే పదం నమోదై ఉంటుంది. ట్యాంపరింగ్, నెంబరు ప్లేట్ నకిలీ చేయడం వంటివి హెచ్‌ఎస్‌ఆర్‌పీలో సాధ్యం కావు. వాహనాల ద్వారా ప్రమాదాలు, నేరాలు జరిగినప్పుడు సులభతరంగా వాహన సొంతదారుల వివరాలు గుర్తించే అవకాశం ఉంది.



హెచ్‌ఎస్‌ఆర్‌పీ ప్లేట్ నమూనా

సర్కారు వాహనాలకే లేవు...

ప్రజలు ఉపయోగించే వాహనాలలో 10శాతం హెచ్‌ఎస్‌ఆర్‌పీ ప్లేట్‌లను అమర్చుకున్నారు. మరో 90శాతం అమలు కావాల్సి ఉంది. గడిచిన వారం రోజులుగా ఆన్‌లైన్, నేరుగా హెచ్‌ఎస్‌ఆర్‌పీ ప్లేట్‌లను రిజర్వు చేసుకునేవారి సంఖ్య వేలనుంచి లక్షలకు పెరిగినట్టు తెలుస్తోంది. ప్రభుత్వ వాహనాల పరిస్థితే అగమ్యగోచరంగా ఉంది. విధానసౌధ, పోలీసు, రెవెన్యూ, జ్యుడీషియల్, అగ్రికల్చర్, స్థానిక సంస్థలు, అగ్నిమాపక, అబ్కారీ, వాణిజ్యపన్నులు, కేఎస్ ఆర్టీసీ తోపాటు ప్రభుత్వశాఖలు, రంగ సంస్థల వాహనాలకు హెచ్‌ఎస్‌ఆర్‌పీ ప్లేట్ సమకూర్చుకోలేదు. ఇప్పటివరకు 5 శాతం వాహనాలు మాత్రమే ఏర్పాటు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఆదేశాలు జారీ చేసే శాఖలు, పర్యవేక్షించిన విభాగాలు సమకూర్చుకున్నాక ప్రజలకు దిశానిర్దేశం చేస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కేంద్రీయ విద్యాలయానికి ఉత్తుత్తి బాంబు బెదిరింపు

బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరం యశ్వంతపుర ప్రాంతంలోని కేంద్రీయ విద్యాలయానికి బాంబు బెదిరింపు చోటు చేసుకుంది. విద్యాలయానికి సంబంధించిన అధికారిక మెయిల్‌కు సమాచారం పంపారు. విద్యాలయ ప్రిన్సిపాల్ అమృతబాల యశ్వంతపుర పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. జనవరి 28న ఉదయం 7.37 గంటలకు మెయిల్ వచ్చింది. అందులో సాహుకారు శ్రీనివాస్‌రావ్65 అట్ జిమెయిల్ డాట్‌కామ్ నుంచి బాంబ్ బెదిరింపు ఉంది. ఆ వెంటనే పోలీసులు విద్యాలయాన్ని సంపూర్ణంగా డాగ్ స్క్వాడ్, బాంబ్ నిష్క్రియా దళంచే తనిఖీలు చేశారు. ఇటీవల బెంగళూరు విద్యాసంస్థలకు వరుసగా బాంబు బెదిరింపులు వస్తున్నాయి. నవంబరు 12న ఏకంగా 70 పాఠశాలలకు జమైకా నుంచి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. కాగా పాఠశాలలకు బాంబు బెదిరింపు విషయం బహిరంగమైతే వివాదాలకు కారణ మవుతుందని రహస్యంగా పరిశీలనలు చేశారు. బాంబు బెదిరింపు ఉత్తిదేనని తేలడంతో పోలీసులు, పాలకవర్గం ఆలస్యంగా ప్రకటించారు.

నేషనల్ ఫ్రిస్బీ టోర్నీ విజేత బెంగళూరు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 4: స్థానిక ఆర్డీటీ స్టేడియంలో అల్టిమేట్ ఫ్రిస్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న నేషనల్ ఫ్రిస్బీ క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఎయిర్ బెండర్స్ బెంగళూరు, బెంగళూరు ఎయిర్‌బోర్న్ జట్లు తలపడగా.. ఎయిర్ బెండర్స్ బెంగళూరు జట్టు విజేతగా నిలిచింది. దేశవ్యాప్తంగా 16 జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా.. 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. నేషనల్ ఫ్రిస్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పుండ్రికుమార్, దీపక్, మాజీ అంతర్జాతీయ క్రీడాకారిణి నిత్య విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భారత్ మాజీ కోచ్ నందన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోలీసులపై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే కుమారుడి అరెస్టు



బాపుగౌడ పాటిల్

బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీసులపై దాడి చేసిన కేసుకు సంబంధించి కోర్టు విచారణకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న ఎల్లాపుర మాజీ ఎమ్మెల్యే వీఎస్ పాటిల్ కుమారుడు బాపుగౌడ పాటిల్‌ను అరెస్టు చేశారు. బెంగళూరులో అరెస్టు చేశాక శనివారం రాత్రి కోర్టు ముందు హాజరు పరిచారు. 2011లో ఏఎస్‌ఐపై దాడి, విధులకు ఆటంకం కలిగించిన మేరకు బాపుగౌడ పాటిల్‌తోపాటు 15మందిపై ముండగోడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇటీవల విచారణకు కాకుండా నిర్లక్ష్యం చేసిన మేరకు న్యాయస్థానం మందలించింది.

గంగాధర నెల్లూరుకు తరలిన బెంగళూరు టీడీపీ అభిమానులు

బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఈనెల 6న చిత్తూరు జిల్లా పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని గంగాధర నెల్లూరు జరగబోయే 'రా కదలిరా' సభకు జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ థామస్ నేతృత్వంలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా డాక్టర్ థామస్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ బెంగళూరులో ఉంటున్న జీడీ నెల్లూరు ప్రాంత వాసులను పేరుపేరునా ఆహ్వానించి 'రా కదలిరా'ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యులు, అభిమానులు జీడీ నెల్లూరుకు ఆదివారం తరలారు. కార్యక్రమంలో తెలుగుదేశం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడుతోపాటు ప్రముఖ నాయకులు, జీడీ నెల్లూరు బెంగళూరు విభాగం ప్రతినిధులు రావిల్ల లోకేష్, భీమినేని సురేష్, ఎంపరాల కుమార స్వామి, డిల్లీ బాబు, గుత్తా అమరనాథ్, గుత్తా గురుప్రసాద్, హేమంత్, త్రిలోక్, ఉదయ్, లక్ష్మీపతి, వినోద్ నూగుళ్ళ, గోపినేని యోగేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు, ప్రముఖులు

ఘనంగా కనకదాస జయంతి



పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే మంజుళా లింబావళి దంపతులు తదితరులు

మహదేవపుర, ఫిబ్రవరి 4: కులం కులమని పోట్లాడకు కులంతో ఏం సాధించావన్నది తెలుసుకో అన్న దాస శ్రేష్ఠులు మానవజాతికి గొప్పసందేశం ఇచ్చారని ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని వారాణసి ప్రభుత్వ పాఠశాల పక్కనగల మైదానంలో ఏర్పాటైన కనకదాస 536వ జయంతికి అధ్యక్షత వహించి మాట్లాడారు. సామాన్యులు సైతం భగవంతుడిని దర్శించుకునే అవకాశం ఉందని అది కేవలం అందరినీ ఆదరించి ప్రేమించడమేనన్న కనకదాస తత్వాలు మనకు ఆదర్శప్రాయమన్నారు. కుల వ్యవస్థలోని పొరపాట్లను, సమాజంలోని మూఢనమ్మకాలను ఆయన తప్పుబట్టారన్నారు. మాజీ మంత్రి అరవింద లింబావళి మాట్లాడుతూ ఆయన భక్తికి మెచ్చి శ్రీకృష్ణ భగవానుడు సైతం మెచ్చారన్నారు. ఉడుపి శ్రీకృష్ణమఠంలో ముఖద్వారం ద్వారా కాకుండా కిటికీ ద్వారా మాత్రమే స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉందని ఇది కనకదాసు గొప్పదనమేనన్నారు. భగవంతుడి దర్శనానికి కులాలు అడ్డు కావని నిరూపించారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వర్తూరు ప్రకాశ్, నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, రూరల్ అధ్యక్షుడు నటరాజ్, ప్రముఖులు అనంతరామయ్య, రామాంజినప్ప, పాపణ్ణ, గణేశ్, శ్రీధర్ రెడ్డి, బైరతి రమేశ్, వర్తూరు చిక్కణ్ణ, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

మైసూరు శ్వానదళంలోకి ల్యాబ్రడార్

బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విశ్వాసానికి మారుపేరుగా ఉండే కుక్కలను కూడా పోలీసు విభాగంలోని శ్వానదళంలో వినియోగిస్తుంటారు. పలు రకాల కేసులను ఛేదించడానికి ఇవే ఆధారం. ఇందులో భాగంగా మైసూరు జిల్లా పోలీస్ శ్వానదళంలోకి ల్యాబ్రడార్ రకం కుక్క పిల్లలను జిల్లా ఎస్పీ సీమా లాట్కర్ కొత్తగా తీసుకున్నారు. వీటికి కూడా దశలవారీగా ప్రత్యేక తర్ఫీదు ఇస్తారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను ఆమె ఫేస్‌బుక్‌లో పంచుకున్నారు.

బస్టాండ్ ఏర్పాటు చేయండి



బస్టాప్ ప్రదేశం ఇదే...

చేళూరు, ఫిబ్రవరి 4: తాలూకా కేంద్రమైన చేళూరులో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయాలని అదే విధంగా బస్ డిపోను కూడా నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. చేళూరు మార్గంలో ప్రతిరోజూ బెంగళూరు, మదనపల్లి, చింతామణి, కదిరి, హిందూపురం, తిరుపతి ప్రాంతాలకు బస్సులు వెళ్తున్నాయి. తాలూకా నుంచి కూడా పలు పనుల నిమిత్తం ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అంతేకాక జిల్లా కేంద్రమైన చిక్కబళ్లాపుర ప్రభుత్వ ఆసుపత్రికి, ముద్దేనహళ్ళి, సాయిబాబా ఆసుపత్రికి, తిరుపతిలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రికి, బెంగళూరులోని ప్రముఖ ఆసుపత్రులకు స్థానికులు వెళ్లి వస్తుంటారు. ఈ నేపథ్యంలో తగిన బసు సౌకర్యం కల్పించాలని, స్థానిక బస్టాప్ ప్రదేశాన్ని మినీ బస్టాండ్‌గా మార్చి అన్ని రకాల బస్సులు ఇక్కడికి వచ్చేలా అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

సివిల్ ఇంజనీర్ల సమస్యలపై సీఎంతో చర్చిస్తా

బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సివిల్ ఇంజనీర్ల సమస్యలపై ముఖ్యమంత్రితో చర్చిస్తానని శాసన సభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ హామీ ఇచ్చారు. కర్ణాటక వర్కింగ్ సివిల్ ఇంజనీర్ల 4వ రాష్ట్రస్థాయి సమావేశం ఇటీవల నగరంలో జరిగింది. సమావేశానికి ముఖ్యులుగా హాజరైన మంత్రి హెచ్‌కే పాటిల్‌కు సంఘం తరపున కర్ణాటక వర్కింగ్ సివిల్ ఇంజనీర్ల ప్రత్యేక చట్టాన్ని అమలు చేయించాలని వినతిని ఇచ్చారు. రాష్ట్రంలో ఐదు లక్షలమంది సివిల్ ఇంజనీర్లు ఉన్నారని తెలిపారు. సివిల్ ఇంజనీర్లకు మినహాయించి ఇతర వృత్తులైన న్యాయవాద, డాక్టర్లు, ఆయుర్వేద, డెంటిస్ట్‌లు, ఆడిటర్‌లు చట్టపరంగా గుర్తింపబడి శాసనబద్ధంగా ప్రత్యేక సంస్థలుగా గుర్తింపబడ్డారని వివరించారు. సివిల్ ఇంజనీర్లకు నియంత్రణ లేని విధంగా మారిందన్నారు. అర్హతలేనివారు పెరిగారని తద్వారా నిర్మాణాలు అస్తవ్యస్తంగా సాగుతున్నాయని, నాసిరకం అవుతున్నాయన్నారు. కేపీసీఈఏ చట్టాన్ని సాధ్యమైనంత త్వరగా అమలు చేయాలని వివరించారు. ఇప్పటికే కలబురగి, బెళగావి, మైసూరులలో జరిగిన సభలు విజయవంతం అయ్యాయని వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. సివిల్ ఇంజనీర్ల సమస్యలను ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.



మంత్రి పాటిల్‌కు జ్ఞాపిక అందజేత

ఆలయాల అభివృద్ధితో గ్రామాభివృద్ధి



విశేషపూజల్లో పాల్గొన్న ప్రముఖులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 4: తాలూకాలోని జంగమకోటె హోబళి హేమార్లహళ్ళిలో శ్రీదేవి భూదేవి సమేత చన్న రాయస్వామి, చౌడేశ్వరి దేవాలయ జీర్ణోద్ధరణ, ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా స్వామివార్లకు కొన్నిరోజులపాటు విశేషపూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఏర్పాటైన పూజల్లో ఎస్ఎన్ క్రియా ట్రస్టు ప్రముఖులు సుమన్ పాల్గొని మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధితో పరోక్షంగా గ్రామాభివృద్ధి సాధ్యమన్నారు. మూడు రోజుల ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో హొసపేట శశికుమార్, కాళనాయకనహళ్ళి రమేశ్, మళమాచనహళ్ళి మునిరాజు, ఉదయ్, నాగేశ్, బసణ్ణ, గోపాల్‌గౌడ, రమేశ్, హేమార్లహళ్ళి శ్రీనివాస్, దేవరాజ్, చన్నకృష్ణప్ప, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన లారీ : ఒకరికి తీవ్ర గాయాలు

దొడ్డబళ్ళాపుర, ఫిబ్రవరి 4: ఇనప కమ్మీ లోడుతో వస్తున్న లారీ ఒక్కసారిగా అదుపు తప్పడంతో రోడ్డుపక్కన ఉన్న షెడ్‌లాంటి దుకాణాన్ని ఢీ కొంది. ఆదివారం పట్టణ శివారులోని పీఎస్ఐ జగదీశ్ సర్కిల్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యాపారి శరవణ తీవ్రంగా గాయపడ్డంతో ఆసుపత్రికి తరలించారు. దేవనహళ్ళి నుంచి వస్తున్న లారీ ఒక్కసారిగా అదుపు తప్పింది. బెడ్‌షీట్‌లు విక్రయించేందుకు తాత్కాలికంగా ఏర్పాటు దుకాణంలోకి దూసుకెళ్లింది. దీంతో నాలుగు దుకాణాలలోని వస్తువులు చెల్లాచెదురయ్యాయి. దొడ్డబళ్ళాపుర పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎయిర్‌పోర్ట్‌లో ఇందిరా క్యాంటీన్

హెబ్బాళ్, ఫిబ్రవరి 4: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకాలలో ఒకటైన ఇందిరా క్యాంటీన్‌ను కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలోనూ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. నగరాభివృద్ధి మంత్రి బైరతి సురేశ్ ఆదివారం ఎయిర్‌పోర్ట్‌ను సందర్శించారు. పనుల ప్రగతిపై ఆరా తీశారు. సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.



పనులను పరిశీలిస్తున్న మంత్రి బైరతి సురేశ్

పాల సహకార సంఘం అధ్యక్షుడిగా బైరేగౌడ



పాలసహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులతో ఎమ్మెల్యే

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 4: తాలూకాలోని హండిగనాళ గ్రామపంచాయతీ లక్కళ్ళి గ్రామంలోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో జేడీఎస్ మద్దతుదారులు అధ్యక్షుడిగా బైరేగౌడ, ఉపాధ్యక్షుడిగా నాగరాజ్ గెలుపొందారు. నూతన సభ్యులుగా సుబ్బణ్ణ, రాజణ్ణ, భారతి దేవరాజ్, రత్నమ్మ గోపాల్, వెంకటేశ్‌లను ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ ప్రత్యేకంగా అభినందించారు. సహకార సంఘాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేలా కృషి చేయాలని సూచించారు. జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు బంక్ మునియప్ప, తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు మునిరెడ్డి, గ్రామపంచాయతీ సభ్యులు సుదీప్, గ్రామ ప్రముఖులు ముని అంచి బైరేగౌడ, పిళ్ళకృష్ణప్ప, నారాయణస్వామి, దేవరాజ్, వెంకటేశ్, ప్రసన్న, రామచంద్రప్ప, జేడీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.